రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అడ్డాకుల, జనవరి 21 : మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకులకు సమీపంలోని కేజీఎన్ దాబా వద్ద 44వ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. అడ్డాకుల ఎస్ఐ మాధవరెడ్డి కథనం ప్రకారం.. అడ్డాకుల మండల పరిధిలోని గుడిబండకు చెందిన ఆంజనేయులు(33) అడ్డాకుల నుంచి బైక్‌పై గుడిబండకు వెళ్తుండగా.. గుర్తు తెలియని వాహనం ఢీకట్టింది. దాంతో ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి పద్మమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో..

ఎన్నికల సందడి



గండీడ్ మండలం నంచర్ల ఉన్నత పాఠశాల

- ఎస్ఎంసీ ఎలక్షన్స్‌కు సన్నాహాలు
- 29న సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపికకు సన్నాహాలు
- నేడు ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 21: ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికల సందడి మొదలు కానుంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రభుత్వ పాఠశాల యాజమాన్యాల(ఎస్ఎంసీ) కమిటీలకు ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, కేజీబీవీ, మోడల్ స్కూల్స్ తదితర పాఠశాలల్లో కొత్త కమిటీలను ఈ నెల 29న ఎన్నుకోనున్నారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు కూడా జారీ చేశారు. దాంతో ఉమ్మడి జిల్లాల్లోని అన్ని పాఠశాలల్లో ఎన్నికల నిర్వహణకు కసరత్తు ప్రారంభించారు.

2019 డిసెంబరులో ఎన్నికలు

పాఠశాల విద్యా కమిటీలకు 2019 డిసెంబరులో ఎన్నికలు నిర్వహించారు. రెండేళ్ల తర్వాత ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా.. వివిధ కారణాల వల్ల నిర్వహించ లేదు. పాత వారినే కొనసాగిస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు చదివే విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని, వారిలోనే సభ్యులను ఎన్నుకుంటారు. ఎన్నికల్లో పోటీ ఎక్కువగా ఉంటే.. పోటీలో ఉన్న అభ్యర్థులకు మద్దతుగా చేతులు ఎత్తే పద్ధతి ద్వారా సభ్యులను ఎనున్నకుంటారు. పోటీ లేకుంటే ఏకగ్రీవంగా ఎన్నుకుంటారు. ఆ తర్వాత ఎంపికైన సభ్యులు చైర్మన్, వైస్ చైర్మన్‌లను కూడా చేతులు ఎత్తే పద్ధతి ద్వారా ఎన్నుకుంటారు. ఎన్నికల్లో విద్యార్థుల తల్లిండ్రులు లేదా పోషకుల్లో ఒకరిని ఓటరుగా ఎంపిక చేస్తారు.

ఎన్నికల షెడ్యూల్ ఇలా..

పాఠశాల విద్యా కమిటీలకు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్ విద్యాశాఖ కమిషనర్ జారీ చేశారు. ఈ నెల 20న అన్ని పాఠశాలల్లో నోటిఫికేషన్‌తో పాటు విద్యార్థుల తల్లింద్రులు, పోషకులకు సంబంధించిన ఓటరు జాబితాను పాఠశాల నోటీస్ బోర్డుపై ప్రదర్శించారు. ఓటరు జాబితాపై ఏమైన అభ్యరంతరాలు ఉంటే ఈ నెల 22న అక్కడి ఎన్నికల అధికారి స్వీకరించి, మార్పులు చేస్తారు. 24న తుది జాబితా ప్రదర్శిస్తారు. 29న ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సభ్యులను ఎన్నుకుంటారు. ఎంపికైన సభ్యులు చైర్మన్, వైస్ చైర్మన్‌లను మధ్యాహ్నం ఎన్నుకుంటారు. అదే రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం వరకు కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తారు. పాఠశాల సమస్యలు, తదితర అంశాలపై చర్చిస్తారు.

ఉమ్మడి పాలమూరు జిల్లాలో 3,870 పాఠశాలలు

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 3,870 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల్లో ఎన్నికల నిర్వహణకు అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎన్నికల అధికారులను కూడా నియమించారు. షెడ్యూల్ ప్రకారం సోమవారం ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. పార్టీల నాయకులు ఈ ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశాం. జీవో 41 ప్రకారం ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. విద్యార్థుల తల్లిదండ్రులు లేదా పోషకులు(ఓటర్లు) చేతులు ఎత్తే పద్ధతిలో ఎన్నికల్లో పాల్గొంటారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. సమస్యాత్మక పాఠశాలలకు ప్రత్యేక అధికారిని పంపిస్తాం. అవసరమైతే పోలీసుల సహకారం కూడా తీసుకుంటాం. గతంలో మహబూబ్‌నగర్ జిల్లాలోని నవాబ్‌పేట మండలంలోని పలు పాఠశాలల్లో విబేదాలు తలెత్తాయి. ఈ సారి అలా జరుగకుండా చర్యలు తీసుకుంటాం.

- రవీందర్, జిల్లా విద్యాశాఖ అధికారి, మహబూబ్‌నగర్ జిల్లా

రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా..

మల్లు రవి



- కేబినెట్ హోదాలో దేశ రాజధానిలో బాధ్యతలు
- సీఎం రేవంత్‌తో సాన్నిహిత్యం, అనుభవం కలిసొచ్చాయనే అభిప్రాయాలు

మహబూబ్‌నగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పాలమూరు కాంగ్రెస్‌కు మరో కీలక పదవి వరించింది. మాజీ ఎంపీ, పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లు రవిని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు ఇచ్చింది. కేబినెట్ హోదాలో ఆయన ఈ బాధ్యతలు నిర్వర్తిస్తారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అన్నీతానై సారథ్యం వహించే మల్లు రవికి ఈ పదవి కట్టబెట్టడం ద్వారా ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి, కేబినెట్‌కు కీలకమైన విషయాల్లో ఉపయుక్తంగా ఉంటుందనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. సమైక్య రాష్ట్రంలోనూ డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ఆయనతో ఉన్న సాన్నిహిత్యంతో మల్లురవి ఈ బాధ్యతలు నిర్వర్తించారు. ఆ సమయంలో ఆయన ఢిల్లీలో కేంద్ర మంత్రులు, కేంద్ర ప్రభుత్వ అధికారులు, సీఎం సహా రాష్ట్ర మంత్రులు, ఇతర నాయకులు, అధికారులకు అవసరమైన పనులు చక్కబెట్టారు. రాష్ట్రానికి అవసరమైన నిధులను తేవడంలో వ్యూహాత్మకంగా వ్యవహరించారనే పేరు గడించారు. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి ఆయన వెన్నంటి ఉన్న మల్లు రవి, పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ నియామకం కావాలనే బలమైన వాదనను పార్టీలో నిర్మించారని, పార్టీలో అన్ని వర్గాలను సమన్వయం చేస్తూ పూర్తి మద్దతుగా నిలిచారని పార్టీలో చర్చ కొనసాగింది. రేవంత్‌కు సన్నిహితుడిగా అసెంబ్లీ ఎన్నికల్లోనూ అన్నీ తానై అండగా ఉన్నారని, ఆ గుర్తింపు, గౌరవం వల్లే తాజాగా మల్లు రవికి అత్యంత కీలకమైన పదవి మరోసారి కట్టబెట్టారనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. కేంద్రంలో కాంగ్రెస్ వ్యతిరేక బీజేపీ ప్రభుత్వం ఉన్న సమయంలో రాష్ట్రానికి ఉండాల్సిన గౌరవప్రదమైన సంబంధాలను రాజకీయాలకు అతీతంగా నిర్వహించారని నాయకులు చెబుతున్నారు. నిధులు, హక్కులు సాధించడానికి కేంద్ర ప్రభుత్వ అధికారులతో సత్సంబంధాలు కొనసాగించే నేర్పు, చాకచక్యంతో వ్యవహరించే మల్లు రవి వంటి సీనియర్ నాయకుడే ఈ పదవికి ఈ సమయంలో సరైన వ్యక్తిగా పార్టీ ఉన్నతస్థాయి వర్గాల్లో ఉన్న అభిప్రాయం ఉందని అంటున్నారు. ఆ మేరకే ఆయనకు ఈ పదవి కట్టబెట్టినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

కాంగ్రెస్‌వాదిగా రాజకీయాల్లోకి..

బాల్యం నుంచి కాంగ్రెస్ వాదిగానే కొనసాగిన డాక్టర్ మల్లురవి తన సోదరుడు, మాజీ ఎంపీ, మాజీ పీసీసీ అధ్యక్షుడు మల్లు అనంతరాములు మరణానంతరం పూర్తి స్థాయి రాజకీయాల్లో ప్రవేశించారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ నుంచి ఎంబీబీఎస్, డీఎల్‌వో పట్టాలు పొందిన రవి తొలుత యూత్ కాంగ్రెస్ డాక్టర్స్ సెల్ చైర్మన్‌గా పని చేశారు. 1992 నుంచి ఇప్పటి వరకు ఏఐసీసీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. సోదరుడు మల్లు అనంత రాములు మరణం తర్వాత 1991లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ స్థానం నుంచి తొలిసారి బరిలో దిగి విజయం సాధించారు. ఆ పర్యాయం ఐదేళ్ల పాటు పూర్తి పదవిలో కొనసాగారు. తిరిగి 1998లో గెలుపొందారు. 1999లో మధ్యంతర ఎన్నికల్లో పరాజయం పాలయ్యారు. అంతకుముునుపు 1996లోనూ ఎంపీ స్థానం చేజార్చుకున్నారు. ఆ తర్వాత 2004లో సమైక్య రాష్ట్రంలో డాక్టర్ వైఎస్ఆర్ సీఎంగా ఉన్న సమయంలో 2004-2008 మధ్యకాలంలో నాలుగేళ్ల పాటు ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తించి, పార్టీలో కీలకనేతగా ఎదిగారు. అనంతరం 2008లో అనూహ్యంగా జడ్చర్ల అసెంబ్లీకి జరిగిన ఉప ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. 2019లో మళ్లీ నాగర్‌కర్నూల్ లోక్‌సభకు పోటీ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ తాజాగా జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఆయనే నాగర్‌కర్నూల్ ఎంపీగా పోటీ చేస్తారనే చర్చ సాగుతున్న సందర్భంలో ఆయనకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పదవిని కట్టబెట్టడం రాజకీయంగా చర్చకు దారితీసింది. ఆయన మళ్లీ ఎంపీగా పోటీ చేస్తారా?.. లేక ఈ టర్మ్‌కు కీలకమైన ఈపదవిలోనే కొనసాగుతారా?.. అనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది.

బీఆర్ఎస్ కౌన్సిలర్లకు విప్ జారీ

- పార్టీ గుర్తుపై గెలిచిన 30 మందికి నోటీసులు
- ఈ నెల 27న అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో అందజేత
- విప్‌కు వ్యతిరేకంగా ఓటు వేస్తే ఆరేళ్లు ఎన్నికలకు దూరమని హెచ్చరిక
- మీ పదవులకు ఢోకా లేదంటున్న అధికార పార్టీ

మహబూబ్‌నగర్, జనవరి 21: పాలమూరు పురపాలికలో అవిశ్వాస రాజకీయం వేడెక్కడంతో బీఆర్ఎస్ పార్టీ తమ కౌన్సిలర్లపై విప్ అస్త్రం ప్రయోగిస్తోంది. విప్‌కు వ్యతిరేకంగా ఓటు వేస్తే ఆరేళ్ల తదుపరి ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులవుతారని హెచ్చరిస్తోంది. ఈ నెల 27న పురపాలిక చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాస ఓటింగ్ ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఎన్నికల గుర్తుపై గెలిచిన కౌన్సిలర్లకు ఆ పార్టీ విప్ జారీ చేస్తోంది. 2019 ఎన్నికల సమయంలో పార్టీ గుర్తుపై 30 మంది కౌన్సిలర్లుగా గెలుపొందారు. వారందరికీ ఇప్పుడు విప్ జారీ చేస్తోంది. కొందరికి నేరుగా, మరికొందరికి పోస్ట్ ద్వారా విప్‌లు అందజేసే ప్రయత్నం చేస్తున్నారు. విప్ అథరైజేషన్‌ను పార్టీ డీసీసీబీ వైస్ చైర్మన్ కోరమోని వెంకటయ్యకు జారీ చేయగా.. ఆయన పేరిట విప్‌లు ఇస్తున్నారు. ఇటీవల పార్టీ మారి.. కాంగ్రెస్‌లో చేరిన వారికి కూడా విప్ జారీ చేస్తున్నారు. ఎన్నిక సమయంలో పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఓటు వేసిన వారికీ విప్ ధిక్కరణ కింద చర్యలు ఉంటాయని బీఆర్ఎస్ హెచ్చరికలు జారీ చేస్తుండగా, అధికార పార్టీ మాత్రం విప్ జారీ చేసినా మీ పదవులకు వచ్చే ఢోకా ఏం ఉండదని అభయం ఇస్తోంది.

ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం

పరిశీలన

- విద్యుత్ కేంద్రంలో షార్ట్ సర్క్యూట్, నాల్గో యూనిట్ పురోగతిపై ఆరా తీసిన వైద్య శాఖ మంత్రి దామోదర
- సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశం



విద్యుత్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న వైద్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ

దోమలపెంట, జనవరి 21: శ్రీశైలం ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రాన్ని రాష్ట్ర వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి ఆదివారం సాయంత్రం పరిశీలించారు. మూడేళ్ల కిందట విద్యుత్ కేంద్రంలో షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన ప్రమాదం, నష్టం, నాల్గో యూనిట్ పురోగతిపై జెన్‌కో సీఈ, ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ ఉత్పత్తిలో సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు సాంకేతికంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వటవర్లపల్లి సర్పంచ్ చత్రునాయక్, ఎంపీపీ శ్రీనువాసులు, ఎంపీటీసీ సభ్యులు మల్లికార్జున్, శ్రీనువాసులు, హరినారాయణగౌడ్ పాల్గొన్నారు.

శ్రీశైలం మల్లన్న దర్శనం

అంతకు ముందు తెల్లవారుజామున మంత్రి కుటుంబ సమేతంగా శ్రీశైలం మల్లన్నను దర్శించుకున్నారు. దేవస్థానం ఈవో పెద్దిరాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం తీర్థ ప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి, సత్కరించారు.

కోయిల్‌సాగర్ నుంచి..

నీటి విడుదల నిలిపివేత

దేవరకద్ర, జనవరి 21: మహబూబ్‌నగర్ జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టు కోయిల్‌సాగర్ నుంచి ఆయకట్టుకు నీటి విడుదలను నిలిపేసినట్లు ప్రాజెక్టు ఈఈ ప్రతాప్ సింగ్ ఆదివారం తెలిపారు. ప్రాజెక్టు నుంచి కుడి ఎడమ కాల్వ ద్వారా పంటలకు గత 10 రోజుల నుంచి నీటిని విడుదల చేశామని చెప్పారు. పది రోజులు పూర్తి కావడంతో నీటి విడుదలను నిలిపేశామని చెప్పారు. మరో పది రోజుల తరువాత నీటిని ఇస్తామని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని చెప్పారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 28 అడుగుల వద్ద నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

మాఫీ ఏదీ?

- చేనేత రుణాలను మాఫీ చేస్తామన్న గత ప్రభుత్వం
- జోగుళాంబ గద్వాల జిల్లాలో రూ.4.43 కోట్ల రుణాలు తీసుకున్న కార్మికులు
- ఈ ప్రభుత్వమైనా మాఫీ చేయాలని విన్నపం



మగ్గంపై పట్టు చీర నేస్తున్న కార్మికుడు

రాజోలి, జనవరి 21: దేశంలో వ్యవసాయ రంగం తరువాత రెండో స్థానంలో కొనసాగుతున్న చేనేత రంగం జోగుళాంబ గద్వాల జిల్లాలో కష్టాల్లో ఉంది. వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులకు పెట్టుబడులు భారమై, నేసిన పట్టు చీరలకు సరైన గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 3000 కుటుంబాల్లో 6,945 మందికిపైగా కార్మికులు చేనేత రంగాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. జిల్లాలో మొత్తం 2,965 జియో ట్యాగ్ పొందిన చేనేత మగ్గాలు ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. కొన్నేళ్లుగా ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోవడం, మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడం, పెట్టుబడులకు రుణాలు ఇచ్చేవారు కరువవడంతో వందల కుటుంబాలు ఈ రంగాన్ని వీడుతున్నాయి. ప్రస్తుతం నిత్యవసర సరుకుల ధరలు పెరగడంతో కూలీ గిట్టుబాటు కావడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మగ్గాల ఏర్పాటు కోసం, పట్టు చీరల తయారీ కోసం అవసరమయ్యే ముడి సరుకుల కొనుగోలుకు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు.

అమలు కాని హామీ

చేనేత రంగాన్ని అభివృద్ధి చేసేందుకు, నేతన్నలను ఆదుకునేందుకు గత ప్రభుత్వం 2023 ఆగస్టు ఏడున జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా రైతు రుణమాఫీ మాదిరి చేనేత రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో మొత్తం 1,148 మంది చేనేత కార్మికులు బ్యాంకుల్లో రూ.4.43 కోట్ల రుణాలు తీసుకున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. దాంతో ఆ రుణాలన్నీ మాఫీ అవుతాయని కార్మికులు ఆశించారు. కానీ మాఫీ చేయలేదు. దాంతో ముడి సరుకుల ధరలు పెరిగి వస్త్రాలు నేయడం భారంగా మారిందని, నేసిన వాటికి గిట్టుబాటు ధరలు రావడం లేదని కార్మికులు వాపోతున్నారు. దాంతో రుణాలు తిరిగి చెల్లించడం అంటుంచితే పూట గడవడమే కష్టంగా మారిందని అంటున్నారు. ఉన్న అప్పు కాస్త పెరుగుతుండటంతో బ్యాంకు వారి నుంచి ఒత్తిళ్లు పెరుగుతున్నాయని చెబుతున్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా రుణాలను మాఫీ చేసి, తమను ఆకలిచావుల నుంచి ఆదుకోవాలని కోరుతున్నారు.



నేత కార్మికులు తయారు చేసిన పట్టు చీరలు

రాయితీతో కూడిన రుణాలు అందించాలి



మా గ్రామంలో నాతో పాటు చాలా మంది నేత కార్మికులు మగ్గాలపై ఆధారపడి జీవిస్తున్నారు. పట్టు చీరలు తయారు చేయడం కోసం కొన్ని రకాల అధునాతన పరికరాలు కావాల్సి ఉంటుంది. చేనేత రుణాలు త్వరగా మాఫీ చేసి, రాయితీతో కూడిన రుణాలు అందించాలి. ప్రస్తుతం పట్టు చీరలకు గిరాకీ లేక.. తీసుకున్న అప్పులు కట్టలేక.. ఇబ్బందులు పడుతున్నాం.

- ఎం.గోపాల్, మాచర్ల, చేనేత కార్మికుడు

విజయం మనదే

- అసెంబ్లీ ఎన్నికల తరహాలో కష్టపడి పని చేయాలి
- మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి

మక్తల్, జనవరి 21: గత అసెంబ్లీ ఎన్నికల తరహాలో కష్టపడి పని చేస్తే లోక్ సభ ఎన్నికల్లో విజయం మనదే అని మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి అన్నారు. ఆదివారం నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి వంశీచంద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తనకు రాజ్య సభ స్థానం కోసం ఆఫర్ ఇచ్చినా.. ప్రజల మధ్య ఉండాలనే కోరికతో లోక్‌సభకు పోటీ చేయాలని అనుకుంటున్నట్లు తెలిపారు. పదేళ్లు అధికారానికి దూరంగా ఉన్నా.. ఎవరూ పార్టీని వీడలేదన్నారు. అక్రమ కేసులు పెట్టి ఇబ్బంది పెట్టినా, కార్యకర్తలు పార్టీకి బలంగా నిలిచారన్నారు. పార్టీని నమ్ముకున్న ప్రతీ కార్యకర్తకు మంచి రోజులు వస్తాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతీ నియోజకవర్గంలో సమావేశాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్రతో అఖండ భారతావనిని ఏకం చేసేందుకు నాలుగువేల కిలోమీటర్ల మేర యాత్ర చేశారన్నారు. బీజేపీ పార్టీ రామమందిర నిర్మాణాన్ని రాజకీయ కోణంలో చూస్తోందన్నారు. ఎన్నికల్లో ఓట్లు రాబట్టేందుకు ఇలా వ్యవహరిస్తోందని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలమంతా శ్రీరాముడితోపాటు ప్రతీ దేవుడ్ని విశ్వసిస్తామన్నారు. మతాలను రాజకీయాలకు వాడుకోవడం కాంగ్రెస్‌కు అలవాటు లేదన్నారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాల్లో బహిరంగ సభలు నిర్వహిస్తారన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసిన ప్రతీ కార్యకర్తకు స్థానిక ఎన్నికల్లో ప్రాధాన్యం ఇస్తామన్నారు. తాను గెలిచిన తర్వాత నియోజకవర్గంలో ఇతర పార్టీలకు చెందిన వారు ఫోన్ చేసి పార్టీలోకి వస్తామని చెబుతున్నారన్నారు. అయినా పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు అన్యాయం జరుగకుండా అండగా ఉంటామన్నారు. బూత్ స్థాయిలో కష్టపడ్డ ప్రతీ కార్యకర్తకు పార్టీ సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి వారికి సేవకుడిగా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యన్నం శ్రీనివాస్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, నారాయణపేట జడ్పీ చైర్‌పర్సన్ వనజ ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి, నాయకులు గవినోళ్ల బాల క్రిష్ణారెడ్డి, నాగరాజుగౌడ్, పోలీస్ చంద్రశేఖర్ రెడ్డి, రవికుమార్ యాదవ్, గడ్డంపల్లి హన్మంతు, గణేష్‌కుమార్, బోయ రవికుమార్, కల్లూరి గోవర్ధన్, ఫయాజ్, నూరుద్దీన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి; పక్కన ఎమ్మెల్యే శ్రీహరి

వివాహిత ఆత్మహత్యాయత్నం

- పురుగుల మందు తాగి అఘాయిత్యం

అచ్చంపేట అర్బన్, జనవరి 21: పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం బొమ్మన్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మన్‌పల్లికి చెందిన వెంకటమ్మ కూతురు అనూష(25).. తల్లి వెంకటమ్మ, చెల్లెలు వ్యవసాయ పొలానికి వెళ్లాక ఇంటి వద్ద పురుగుల మందు తాగింది. అనూష కొన్ని రోజుల కిందట అత్తగారి ఊరు నుంచి తల్లి ఇంటికి వచ్చింది. చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు.





ఘనంగా హంస వాహన సేవ

» ముగిసిన లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

కొల్లాపూర్, జనవరి 21 : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల పరిధిలోని సింగోటం గ్రామ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి నిర్వహించిన హంస వాహనసేవతో ముగిశాయి. ఈ కార్యక్రమాన్ని పురోహితులు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, కనులారా వీక్షించారు. ఆలయ ధర్మకర్త ఎస్‌వీకేకేబీ ఆదిత్య లక్ష్మారావు సేవలో పాల్గొన్నారు. ఈ నెల 15వ తేదీన ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మరో 15 రోజుల పాటు జాతర కొనసాగుతుందని ఆలయ పురోహితులు సతీష్‌శర్మ తెలిపారు.









ఐదవ తరగతి ప్రవేశ పరీక్షకు
దరఖాస్తు గడువు పొడిగింపు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 21 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2024-2025 విద్యా సంవత్సరానికి గాను ఐదో తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఈ నెల 23 వరకు గడువు పొడిగించినట్లు గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ ఫ్లోరెన్స్‌రాణి ఆదివారం ఒక ప్రక టనలో తెలిపారు. నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు మాత్రమే ఆన్‌లైన్ ద్వారా రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ పరీక్షలో అర్హత సాధిస్తే ఉమ్మడి పాలమూరు జిల్లాలోని గురుకులాల్లో సీట్లు కేటాయిస్తార ని తెలిపారు. ఇందుకు సంబంధించి అర్హత పరీక్ష ఫిబ్రవరి 11న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందని తెలిపారు.

వచ్చేనెల 16న సమ్మెను విజయవంతం చేయాలి


పాలమూరు, జనవరి 21 : ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దీప్లానాయక్, నల్లవెల్లి కురుమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు, ప్రజల వినాశకర విధానాలు అవలంభిస్తోందన్నారు. ఫిబ్రవరి 16వ తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త స మ్మెలో అన్ని కార్మిక సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పదేళ్ల కాలంలో బీజేపీ అనుసరించిన విధానాల వల్ల దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసి ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించటం దారుణమన్నారు. రాజకీయాల్లో మతం, కులం, ప్రాంతం చివరకు దేవుడిని సైతం వాడుకుని ప్రజల్లో అనైక్యత విభజన సృష్టించి బీజేపీ రాజ్యమేలు తోందన్నారు. ఇసుక దొరకక భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన చెందారు.

పోమాల సర్పంచ్‌కు ఆర్థిక సాయం

నవాబ్‌పేట, జనవరి 21 : మండలంలోని పోమాల గ్రామ సర్పంచ్ కృష్ణయ్య తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రిలో చికిత్స పొందగా, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు ఆదివారం ఆర్థికసాయం చేశారు. మూడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో అప్పట్లో సుమారు నెల రోజుల పాటు కోమా లోకి వెళ్లిపోయాడు. చాలా కాలం పాటు చికిత్స అనంతరం కోలుకున్నాడు. గత వారం రోజుల క్రితం తిరిగి అనారోగ్యం పాలు కావడంతో మరోమారు కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆర్థిక పరిస్థితి బాగాలేనందున ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ విషయం తెలిసిన మాజీ సర్పంచులు మూడు రోజుల క్రితం రూ.50,000లు, అందజేయగా, ఆదివారం ప్రస్తుత సర్పంచులు రూ.50,000 అందజేశారు.







ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	ఏషియన్ వైష్ణవి - ఆర్.సి.పురం
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
ఫోరం మాల్ - కూకట్‌పల్లి	సినీ ప్లానెట్ - కొంపల్లి
ఆర్.కె. - బంజారాహిల్స్	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఏషియన్ రాధిక - కాప్రా
గలేరియా - పంజాగుట్ట	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఐకాన్ - హైటెక్‌సిటీ	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	మిరాజ్ సినిమాస్ - బాలానగర్
ప్రెస్టీజ్‌మాల్ - గచ్చిబౌలి	మిరాజ్ సినిమాస్ - చందానగర్
అట్రియమ్ - గచ్చిబౌలి	లక్ష్మీనరసింహ - మియాపూర్
ఎస్ఐ నోవ - మల్లాపూర్	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
ఎం.పి మాల్ - కాచిగూడ	మూవీటైమ్ - అమీర్‌పేట్
జిఎస్ఎమ్ - మదీనగూడ	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
నెక్లెస్ సత్య - కవాడిగూడ	టివోలి - సికింద్రాబాద్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
మంజీరామాల్ - కూకట్‌పల్లి	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	షా షహెన్‌షా - చింతల్
మంత్రామాల్- అత్తాపూర్	లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్
సుధా - శాలిబండ	మూవీమ్యాక్స్ - మౌలాలి
	జె.పి.సినిమాస్ - చందానగర్

బీసీలకు అన్యాయం చేస్తే సహించే ప్రసక్తే లేదు

- బీసీ సంఘం సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

కల్వకుర్తి, జనవరి 21 : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పదవులు, నామినేటెడ్ పోస్టుల భర్తీలో బీసీలకు అన్యాయం చేస్తే సహించే ప్రసక్తే లేదని బీసీ సంఘం సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలను విస్మరించినందునే కాంగ్రెస్ పార్టీ అనుకూలంగా ఓటు వేసిన విషయాన్ని కాంగ్రెస్ అగ్రనేతలు గుర్తించాలని పేర్కొన్నారు. ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీని ఇటీవల కలవడం జరిగిందని, సామాజిక న్యాయమే కాంగ్రెస్ ఎజెండాగా ఉంటుందని తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో 12మంది ఉంటే కేవలం ఇద్దరికే అవకాశం కల్పించారని పేర్కొన్నారు. హైకోర్టులో అడ్వకేట్ జనరల్‌గా, అడిషనల్ అడ్వకేట్ జనరల్‌గా ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రభుత్వ కీలక శాఖల పోస్టింగ్‌లో బీసీలకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేబినెట్ హోదా కలిగిన నలుగురిని ప్రభుత్వ సలహాదారులుగా నియమించిందని, అందులో ఒక్కరు కూడా బీసీ లేకపోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బీసీలకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ జన సైన్యం రాష్ట్ర అధ్యక్షుడు సింగం నాగేష్‌గౌడ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌యాదవ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లింగంగౌడ్, నాయకులు రాజేందర్, దుర్గాప్రసాద్, నరసింహ, విజయ్‌గౌడ్, రాంసాగర్, రమేష్‌బాబు, శేఖర్, అనిల్ తదితరులున్నారు.


విలేకర్లతో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

12 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

వడ్డేపల్లి, జనవరి 21 : గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల పరిధిలోని కొంకల గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. 12 క్వింటాళ్ల బియ్యాన్ని శాంతినగర్ హెడ్‌కానిస్టేబుల్ రాజవర్ధన్ రెడ్డితో పాటు సిబ్బంది పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని స్టేషన్‌కు తరలించామని తెలిపారు. వీరబాబు, వడ్డే భానుతో పాటు ఇద్దరు కూలీలపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వడ్డేపల్లి, జనవరి 21 : శాంతినగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు రోజుల క్రితం పత్తిలోడుతో వెళుతున్న బొలెరో వాహనం బోల్తాపడింది. ప్రమాదంలో కూలీలు దుబ్బన్న, మారన్నలకు తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మారన్న (65) అనే వ్యక్తి మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ రాజవర్ధన్ రెడ్డి తెలిపారు. మృతుడి భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్



గద్వాలలో మహాసభ ర్యాలీ నిర్వహిస్తున్న ఐఎఫ్‌టీయూ పంచాయతీ కార్మికులు

గద్వాల టౌన్, జనవరి 20 : గ్రామాల్లో పారిశుధ్య పనులు మొదలుకుని అన్నిరకాల అభివృద్ధి కార్యక్రమాల్లో కీలకంగా పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా మూడవ మహాసభను ఆదివారం పట్టణంలోని టీఎన్జీవో భవనంలో నిర్వహించారు. సభలో మాట్లాడిన అరుణ్‌కుమార్, పంచాయతీ కార్మికులకు ఇచ్చిన అన్నిరకాల హామీలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. అవే విషయాలను తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో కార్మికులకు న్యాయం చేయాలన్నారు. రూ.19,500లు కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ప్రమాద, సహజ మరణ బీమా సౌకర్యం కల్పించాలన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగులను వివిధ కేటగిరీలుగా విభజించాలన్నారు. రోజు ఎనిమిది గంటల పని సమయంతో పాటు ప్రతి ఆదివారం, పండుగ సెలవులు తొలగించాలని, అక్రమ తొలగింపులను ఎత్తివేయాలని, 30శాతం పీఆర్‌సీని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ, పీడీఎస్‌యూ నాయకులు హనుమంతు, కార్తీక్, హరీష్, చందు, చరణ్, అద్భుత కుమార్, చంద్రాములు, తిమ్మప్ప, పరశురాములు, భీమన్న, వెంకట్రామిరెడ్డి, నల్లస్వామి, బజారమ్మ, నరసింహులు, తిమ్మప్ప, మధు ఉన్నారు. మహాసభల సందర్భంగా స్థానిక కృష్ణవేణి చౌరస్తా నుంచి రాజీవ్‌మార్గ్, పాతబస్టాండ్ సర్కిల్ మీదుగా టీఎన్జీవో భవనం వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు.

ఆంజనేయస్వామి సన్నిధిలో వ్యాసరాజాయ పీఠాధిపతి


స్వామివారిని దర్శించుకున్న వ్యాసరాజాయ పీఠాధిపతి

ధరూరు, జనవరి 21 : ధరూరు మండల పరిధిలోని ప్రసిద్ధి గాంచిన శ్రీ పెద్దచింతరేవుల ఆంజనేయల స్వామి ఆలయాన్ని ఆదివారం బెంగుళూరులోని వ్యాసరాజాయ మఠం పీఠాధిపతి విద్య శిరీషాస్వామి దర్శించుకున్నారు. ముందుగా పీఠాధిపతి ఆలయ సమీపాన ఉన్న కృష్ణానది వద్ద పుణ్యస్నానం ఆచరించిన అనంతరం స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వీరి వెంట ఆలయ ధర్మకర్త గిరిరావు, అర్చకులు మధ్వాచారి, కేశవాచారి ఉన్నారు.

జానపద కళాకారులను ఆదరించాలి

- జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగా శ్రీనివాస్‌గౌడ్

కందనూలు, జనవరి 21 : జానపద కళాకారులను ఆదరించాలని జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్ శివాలయం హాలులో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని జానపద కళాకారులను గుర్తించి ఆదరించాలన్నారు. రాష్ట్ర జానపద కళాకారుల సంఘం తరపున గుర్తింపు కార్డులు ఇప్పిస్తామని, ప్రభుత్వానికి కళాకారులకు వారధిగా పని చేసి కళాకారుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జానపద సంఘం మహిళా ప్రధాన కార్యదర్శి కవిత, రాష్ట్ర కార్యదర్శి డప్పుస్వామి, జిల్లా గౌరవ అధ్యక్షుడు రాంచందర్, అధ్యక్ష కార్యదర్శులు కృష్ణయ్యగౌడ్, లింగస్వామి, సలహాదారులు డి.రాములు, మురళీధర్‌రావు, రాము, చెన్నకేశవ, పోలోజు సత్యం, సరిత, సాయికుమార్, సురేష్, మండల ప్రతినిధులు పాల్గొనగా జిల్లాలో ఉన్న గ్రామీణ జానపద కళారూపాలైన యక్షగానం, కూర్వ డోలు బతుకమ్మ, కోలాటం, కప్పకపుడు, భజన బృందం, జానపద కళాకారులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వంగా శ్రీనివాస్‌గౌడ్

అర్ధ శతాబ్దం అనంతరం ఆత్మీయ సమ్మేళనం


జడ్చర్ల మండలంలోని మీనాంబరం పరుషవేదీశ్వరస్వామి దేవాలయం వద్ద ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్న పూర్వ విద్యార్థులు

జడ్చర్ల, జనవరి 21 : అర్ధ శతాబ్దం అనంతరం ఆత్మీయ సమ్మేళనాన్ని పూర్వవిద్యార్థులు జరుపుకున్నారు. జడ్చర్ల మునిసిపాలిటీలోని బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్‌లో 1972-73 విద్యాసంవత్సరంలో కలిసి చదువుకున్న ఎస్ఎస్‌సీ విద్యార్థులు ఆదివారం జడ్చర్ల మండలం అల్వాన్‌పల్లి సమీపంలోని మీనాంబరం పరుసవేదీశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో బాల్య మిత్రుల స్వర్ణోత్సవ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. కలిసి చదువుకున్న సందర్భంలో చేసిన అల్లరి, గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు సన్మానించారు. అర్ధశతాబ్దం అనంతరం కలుసుకున్న వారిలో మాజీ సర్పంచ్ సీతారాంరఘూవర్, శివకుమార్, మురళి, ఖాదర్ పాషా, ఫిరోజ్, శ్రీనివాస్, తాహెర్, శశి, విజయలక్ష్మీ, సుశీల, అరుణ, సుధాకర్ పాల్గొన్నారు.

స్వామి వివేకానంద పురస్కారం అందుకున్న సంధ్య

బాలానగర్, జనవరి 21 : స్వామి వివేకానంద జయంతి వేడుకల ముగింపు కార్యక్రమం ఆదివారం హైదరాబాద్‌లోని అబిడ్స్‌లో నిర్వహించారు. నవభారతి నిర్మాణ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో స్వామి వివేకా నంద అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. బాలానగర్ మండలంలోని హేమాజీపూర్‌కు చెందిన డాక్టర్ సంధ్యకు పురస్కారం రాగా, ఫౌండేషన్ చైర్మన్ హేమంత్, పీవీఆర్ ట్రస్ట్ అధినేత విష్ణువర్ధన్ రెడ్డి సత్కరించి, షీల్డ్‌ను అందజేశారు. కార్యక్రమంలో శివలింగం, నర్సింహయాదవ్, నరేందర్‌రెడ్డి, అల్వాల్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


పురస్కారం అందుకుంటున్న డాక్టర్ సంధ్య

క్రీడాకారుల ఉన్నతికి సహకారం

మద్దూర్, జనవరి 21 : నైపుణ్యం కలిగిన జిల్లా క్రీడాకారుల ఎదుగుదలకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలం భూనీడ్‌లో బీజేవైఎం మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి మద్దూర్ మండల స్థాయి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన దంగాన్‌పూర్, భూనీడ్ విన్నర్, రన్నర్ టీంలకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ ఇలాంటి టోర్నమెంట్‌లు నిర్వహించడం వల్ల గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం కలిగిన క్రీడాకారులున్నా వారికి సరైన ప్రోత్సాహం లేకపోవడంతో వెలుగులోకి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎదగడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అయోధ్యలో సోమవారం జరగనున్న బాల రాముని ప్రాణ ప్రతిష్ట సందర్భంగా ఇండ్లను, ఆలయాలను శుద్ధి చేసి భజనలు, అన్నదానాలు తదితర కార్యక్రమాలు నిర్వహించుకోవాలని ప్రజలను కోరారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ స్థానం నుంచి తాను పోటీలో ఉంటానన్నారు. ఈ సందర్భంగా బీజేపీ ఫ్లోర్ లీడర్ సత్యరఘుపాల్‌రెడ్డి, మహిళా మోర్చా కార్యదర్శి లలిత, జిల్లా లీగల్ సెల్ కోకన్వీనర్ చిరంజీవిరెడ్డి, సర్పంచ్ వెంకటేశ్ పాల్గొన్నారు.


భూనీడ్‌లో క్రికెట్ విజేతలకు కప్ అందిస్తున్న డీకే అరుణ

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 21: నాగర్‌కర్నూల్ జిల్లాలో రెడ్‌క్రాస్ చేపడుతున్న సామాజిక సేవలు అభి నందనీయమని అమెరికన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు సిస్కోబీ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ భవన నిర్మాణ పనులను సిస్కోబీ పరిశీలించారు. అనంతరం జిల్లా కమిటీ ఏర్పడిన నాటి నుంచి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో చేపట్టిన రక్తదాన శిబిరాలు, చెంచు గిరిజనులకు వైద్యం తదితర సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా రెడ్‌క్రాస్ సేవలతో పాటు భవన నిర్మాణా నికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. పారిశ్రామికవేత్త భాస్కర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి రమేష్‌రెడ్డి, యూత్ రెడ్‌క్రాస్ జిల్లా కన్వీనర్ డి.కుమార్, రెడ్‌క్రాస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మాగనూరు, జనవరి 21 : నారాయణపేట జిల్లా మాగనూరు మండలం పెగడబండ గ్రామ శివారులో గల పెద్దవాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్ఐ మల్లేష్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. పెగడబండ గ్రామానికి చెందిన కావలి రాము ఆదివారం తెల్లవారుజామున పెగ డబండ రూటులో పెట్రోలింగ్‌కు వెళ్తున్న సమయంలో ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఆపి అనుమతి పత్రాలు అడిగారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్టేషన్‌కు తీసుకొచ్చి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తెలకపల్లి : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం గౌరారం గేట్ సమీపంలో ఆదివారం సాయంత్రం ఏఎస్ఐ జీఆర్ సుధీకర్ కుమార్ తన సిబ్బందితో ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ట్రాక్టర్ డ్రైవర్లు రామగిరి గ్రామానికి చెందిన మద్దెలబండ మల్లేష్, ఎండబెట్ల గ్రామానికి చెందిన భాషమోని జంగయ్య, గౌరారం గ్రామానికి చెందిన వనం సాయికుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

'మరుగు' లేక అవస్థలు

» ఎర్రవల్లి చౌరస్తాలో మూత్రశాలలు కరువు » ఇబ్బంది పడుతున్న మహిళా ప్రయాణికులు

» ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రజలు » స్థలం లేదంటున్న ప్రజాప్రతినిధులు


ఎర్రవల్లి చౌరస్తాలో ప్రధాన కూడలి

ఎర్రవల్లి, జనవరి 21 : జాతీయ రహదారిపై నున్న ఎర్రవల్లి చౌరస్తాలో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా మహిళా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులనె ఎదుర్కొంటున్నారు. 44వ నెంబర్ జాతీయ రహదారిపైనున్న ఎర్రవల్లి చౌరస్తా మీదుగా ప్రతీ రోజూ ప్రయాణికుల రాకపోకలు అధికంగా సాగుతుంటాయి. దగ్గరలో ఉన్న జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంతో పాటు, కర్ణాటక, రాయచూర్ ప్రాంతాలతో పాటు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైపు రోజూ వందలాది వాహనాలు ఈ చౌరస్తా మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. అలాగే చౌరస్తా నుంచి అలంపూర్ నియోజకవర్గంలోని 30 గ్రామాలకు పైగా ప్రజలు, అధికారులు, ఉపాధ్యాయులు ఈ చౌరస్తా మీదుగానే రాకపోకలు సాగించాల్సి ఉంటుంది.

రోజూ వందల సంఖ్యలో ఇటు హైదరాబాద్, అటు బెంగళూరు జాతీయ రహదారితో పాటు గద్వాల, రాయచూర్ వెళ్లే ప్రయాణికులు ఇక్కడే బస్సుల కోసం వేచి చూస్తూ ఉంటారు. చౌరస్తా నుంచి నాలుగు మార్గాల్లో కిలోమీటరు మేర దుకాణ సముదాయాలు, హోటళ్లు ఉండటంతో జనం రద్దీ కూడా అధికంగానే ఉంటోంది. అయితే ఈ ప్రాంతంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. ఇక్కడ భూమి విలువ కోట్ల రూపాయలకు చేరడం, ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోవడంతో వాటిని నిర్మించడం కష్టతరంగా మారింది. అయితే తాత్కాలికంగా మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేస్తే సమస్య కొంతైనా పరిష్కారం అవుతుందన్న అభి ప్రాయం వ్యక్తం అవుతోంది. హైవే అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ విషయంపై దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇబ్బందులు వాస్తవమే

ఎర్రవల్లి చౌరస్తాలో ప్రతీ రోజూ వందలాది ప్రయాణికులు ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమే. మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణానికి స్థలం అందుబాటులో లేకపోవడం సమస్యగా మారింది. గతంలో సంబంధిత అధికారులు చౌరస్తాకు వచ్చి పరిశీలించారు. బస్టాండ్ వద్ద వీటిని ఏర్పాటు చేయాలనుకున్నప్పటికీ, ట్రాఫిక్ అంతరాయం కలిగే అవకాశముంది. ఈ సమస్యను జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాను.

- రవి, సర్పంచ్ ఎర్రవల్లి



కొత్త ఓటరు దరఖాస్తులు తీసుకోవాలి

- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ జి. రవి నాయక్



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జి. రవి నాయక్

దేవరకద్ర, జనవరి 21 : కొత్తగా ఓటు కోసం చేసుకునే దరఖాస్తులను సోమవారం వరకు తీసుకోవచ్చని కలెక్టర్ రవినాయక్ రెవెన్యూ అధికారులకు సూచించారు. ఆదివారం మండల పరిధిలోని చౌదర్‌పల్లి, అజిలాపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలు రానుండడంతో ఎవరైనా కొత్త ఓటు కోసం నేటి వరకు దరఖాస్తు చేసుకున్నవారు తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద వసతులు సౌకర్యాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అయన వెంట తహసీల్దార్ బి.శ్రీనివాసులు, ఉప తహసీల్దార్ శివరాజు, ఆర్ఐ సురేష్, సంతోష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మండలంలో పరిశీలన

మహబూబ్‌నగర్ రూరల్ : ఓటరు జాబితాను బీఎల్‌ఓలు క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ రవినాయక్ సూచించారు. ఆదివారం మండలంలోని ఓబులాయపల్లి, చౌదర్ పల్లి, దర్మాపూర్ గ్రామాల్లో కలెక్టర్ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త ఓటరు నమోదు, వలస వెళ్లిన ఓటర్ల వివరాలు, ఓటర్లు బదిలీ, చేర్పుల సవరణ నకిలీ ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి మార్పులు చేర్పులు చేయాలని బీఎల్‌వోలకు సూచించారు. త్వరితగతిన పెండింగ్ పనులు పూర్తి చేయాలని సూచించారు.

ఓటర్ నమోదు కేంద్రాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

బాలానగర్, జనవరి 21 : పోలింగ్ కేంద్రాలలో బీఎల్‌వోలు ఓటర్ నమోదును వివరంగా పరిశీలించి నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శనివారం మండలంలోని వల్లభరావుపల్లిలో నిర్వహిస్తున్న 78, 79, 80, 81 నంబరు గల పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. నూతనంగా చేపడుతున్న ఓటర్ నమోదు వివరాలు, తీసివేతలు, తదితర వివరాలు బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. ఆర్ఐ వెంకటొరెడ్డి, బీఓల్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.

మల్లు రవిని సత్కరించిన కాంగ్రెస్ నాయకులు



మల్లురవిని సత్కరించిన నవాబ్‌పేట మండల కాంగ్రెస్ నాయకులు

మహబూబ్‌నగర్/ నవాబ్‌పేట, జనవరి 21 : ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమితులైన డాక్టర్ మల్లు రవిని జిల్లా కాంగ్రెస్ నేతలు సత్కరించారు. ఆదివారం హైదరాబాద్‌లో డీసీసీ మీడియాసెల్ కన్వీనర్ సీజె బెనహర్ సత్కరించారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఢిల్లీలో ప్రత్యేక ప్రతినిధిగా పనిచేసిన మల్లురవి సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించారని చెప్పారు. ఇప్పుడు కూడా ఆయన సమర్థవంతంగా పనిచేసి రాష్ట్రానికి ప్రయోజనం చేకూరుస్తారని పేర్కొన్నారు. ● నవాబ్‌పేట మండల అధ్యక్షులు రామచంద్రయ్య, మండల ఉపాధ్యక్షులు హమీద్ మహేక్, బంగ్లరవి, దేపల్లి వెంకటేష్ గౌడ్, కొల్లూర్ ఖాజ, మల్లేష్ యాదవ్, షబ్బీర్ అలీ, ఖైనుద్దీన్ తదితర నేతలు హైదరాబాద్‌లో మల్లు రవిని కలిసి సన్మానించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

అడ్డాకుల, జనవరి 21 : మండల పరిధిలోని శాఖాపూర్‌లో ఆదివారం అడ్డాకుల జడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి పలువురు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. గోద సత్యన్నగౌడ్ మృతి చెందడంతో మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఇటీవల మరణించిన కావలి నాగన్న, మూసాపేట సాయన్నల కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా కిడ్నీ సంబంధ వ్యాధితో బాధపడుతున్న గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కావలి నాగరాజు తల్లి కోటమ్మను పరామర్శించారు. పరామర్శించిన వారిలో సర్పంచు గోద జయన్నగౌడ్, నాగారాజు, బలిజ యాదయ్య, రాజేందర్, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రసాద్, సాయిరాం, భాస్కర్‌గౌడ్, నెలికొండి వెంకటయ్య, కావలి కురుమూర్తి, బాలస్వామి, చంద్రయ్యలు వున్నారు.

వాసవి విద్యార్థి హాస్టల్‌లో ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలతో నిర్వాహకులు

పాలమూరు, జనవరి 21 : జిల్లా కేంద్రంలోని వాసవి విద్యార్థి వసతిగృహంలో ఆదివారం వాసవిక్లబ్ ఆధ్వర్యంలో ముగ్గులపోటీలు నిర్వహించారు. వందమంది మహిళలు ముగ్గులపోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమం సి.హెచ్. స్రవంతి గెలుపొందితే ఆమెకు విట్యాల రాజేశ్వర్ బహుమతి అందజేశారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కలకొండ శ్రీనివాసులు, ఆగీరు రాఘవేందర్, కోశాధికారి మక్తల్ భీంశంకర్, కొక్కుల్ల చంద్రశేఖర్, వి.చంద్రశేఖర్, వి.శ్రీదేవి, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్-టీఎస్ జిల్లా కమిటీ ఎన్నిక

పాలమూరు, జనవరి 21 : ఎమ్మార్పీఎస్-టీఎస్ జిల్లా కమిటీని ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్.సీ కమ్యూనిటిహాలులో ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్-టీఎస్ దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ పి.జంబులయ్య ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడిగా వై.నరేష్, జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్‌గా కాలే యాదయ్య, ఉపాధ్యక్షులుగా కొత్త మాధవ్, ప్రధాన కార్యదర్శిగా రావుల కృష్ణ, కార్యదర్శిగా శ్రీను, ప్రచార కార్యదర్శిగా సి.హెచ్ రాజు, సంయుక్త కార్యదర్శిగా రఘు, సభ్యులుగా జైహనుమంతును ఎన్నుకున్నారు.

విజయవంతంగా ముగిసిన క్రికెట్ టోర్నీ



విజేతకు బహుమతిని అందజేస్తున్న నిర్వాహకులు

చిన్నచింతకుంట, జనవరి 21 : మండలంలోని నెల్లికొండి గ్రామంలో సల్లుటి రాహుల్‌రెడ్డి స్మారకార్థం, ఈనెల 12 నుంచి సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం విజయవంతంగా ముగిసాయి. మొదటి విజేతగా గోపన్‌పల్లి, రెండవ విజేతగా కోటకదిర జట్లు విజయం సాధించాయి. మొదటి బహుమతి సాధించిన విజేతకు రూ.25వేలు,రెండవ బహుమతికి రూ.15వేలు ఉమాకృష్ణకుమార్‌రెడ్డి దంపతులు అందజేసారు. ఇందులో మొత్తం 36 జట్లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ఉమాకృష్ణ కుమార్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి,గ్రామ సర్పంచ్ వెంకటేష్‌యాదవ్, ఉపసర్పంచ్ రుతిరాజ్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, నందీశ్వర్‌రెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, మదన్మోహన్‌రెడ్డి, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముస్తాబైన జిల్లా కేంద్రంలోని టీచర్స్‌కాలనీ రామాలయం



కోయిలకొండలో రామకొండపై జై శ్రీరాం అనే పెయింటింగ్‌తో భక్తులు



చిన్న వడ్డెమాన్‌లో శ్రీఆంజనేయ స్వామి ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేసిన భక్తులు

అంతా సిద్ధం

-ఆలయాల శుద్ధి, విద్యుద్దీపాలతో అలంకరణ

- నేడు అభిషేకాలు..అన్నదాన కార్యక్రమాలు

మహబూబ్‌నగర్/ కోయిలకొండ/ చిన్నచింతకుంట/ హన్వాడ/ రాజాపూర్/ గండీడ్/ బాలానగర్, జనవరి 21 : అయోధ్యలో సోమవారం రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా పాలమూరుల పట్టణంలోని ఆలయాలన్నింటిని ఆదివారం శుద్ధిచేశారు. ఆలయాలకు సంప్రోక్షణ చేసిన అర్చకులు దేవుళ్ల విగ్రహాలను కడిగి ముస్తాబు చేశారు. నేడు రోజంతా అన్ని ఆలయాలలో పలు కార్యక్రమాలు చేపట్టనున్నారు. దేవుళ్ళకు పాలాభిషేకం చేసిన అనంతరం పూజ కార్యక్రమాలు నిర్వహించి భజనలు చేపట్టనున్నారు. మధ్యాహ్నం వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమాలు చేపట్టనున్నారు. అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవం కార్యక్రమాన్ని వీక్షించేందుకు జనం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. కోయిలకొండలో రామకొండపై జై శ్రీరాం అని బండపై వాల్ పేయింటింగ్ వేశి భక్తులు తమ భక్తిని చాటుకున్నారు. భారీగా శ్రీరాముని కటౌట్లు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. చిన్నచింతకుంట మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రధాన ఆలయాలను శుద్ధి చేశారు. కాషాయ జెండాలతో గ్రామాలు కాషాయమయంగా మారాయి. హన్వాడ మండలంలోని అన్ని గ్రామాలలో దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. రాజాపూర్‌లోని సీతారామదేవాలయంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని హనుమాన్ దేవాలయాలను భక్తులు, నాయకులు, ప్రజాప్రతినిధులు శుద్ధి చేశారు. గండీడ్‌లోని ఆంజనేయస్వామి, శ్రీముడి ఆలయాల్లో సందడిగా మారింది. గ్రామాల్లో గోడలపై భక్తులు యువకులు జై శ్రీరాం అనే ముద్రలు వేస్తున్నారు. బాలానగర్ మండలంలోని వివిధ గ్రామాలలో దేవాలయాల్లో శ్రీరామ నామ జపం కొనసాగుతోంది. అయోధ్య శ్రీరాముని పూజిత అక్షింతలు గ్రామాలలో పంపిణీ చేశారు.



రాజాపూర్‌లో ఆలయాన్ని శుద్ధి చేస్తున్న భక్తులు

సరస్వతి పుత్రులకు నిలయం పాలమూరు

- విద్యాదానం మహాదానం

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



విద్యార్థులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 21 : పాలమూరు సరస్వతి పుత్రు లకు నిలయం అని మనకు ఉన్నఏకైక ఆస్తిచదువుల తల్లి సరస్వతి అని మహ బూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం లోని వాసవి ఎడ్యుకేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో జిల్లా రైస్‌మిల్లు అసోషియేషన్ భవన్‌లో ఆదివారం జరిగిన ప్రతిభకనబర్చిన విద్యార్థులకు ఆర్థిక సాయం, కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉన్న వనరులు ఉపయోగించుకొని పాలమూరు జిల్లాకు చెందిన పలువురు ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. పలువురు ప్రముఖులు జిల్లాకు పేరు తెచ్చారన్నారు. వాసవి ట్రస్టు సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చడమే తన ల క్ష్యమన్నారు. అనంతరం ఎమ్మెల్యేను వాసవి ట్రస్టు సభ్యులు ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో మురళి, పుల్లా కృష్ణయ్య, కలకొండ సూర్యనారాయణ, కొండ చక్రధర్‌గుప్తా, బాలాజీ, రామ్మోహన్, గుండి వెంకటేష్, జున్ను రమేష్, కండే కుమారస్వామి, మిర్యాల వేణుగోపాల్, రాఘవేందర్ పాల్గొన్నారు. అనంత రం 30 మంది విద్యార్థులు ఆర్థిక సహాయం చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

బీసీటీఏ క్యాలెండర్ ఆవిష్కరణ

బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం 2024 క్యాలెండర్‌ను ఆదివారం జడ్చర్ల ఎమ్మెల్యే అనురుధ్‌రెడ్డి, దేవకద్ర ఎమ్మెల్యే జి.మధుసుదన్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకరయ్య, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే వంశీచందర్‌రెడ్డిలు ఆవిష్కరించారు. బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.కృష్ణుడు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, గురుప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయకుమార్, నాయకులు మల్లేష్, ధనుంజయ, అనిల్, గోపాల్, గోపాల్‌గౌడ్, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల కోసం కృషి చేయాలి

ఉత్తమ ఫలితాల సాధించించేందకు అధ్యాపకులు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 సంవత్సరపు క్యాలెండర్, డైరీ ఎమ్మెల్యే ఆవిష్కరించారు. తిరుపతిరెడ్డి, నాగరాజు, పారిజాతం, గిరిజాశెట్టి, మహేష్‌శెట్టి పాల్గొన్నారు.

బెల్ట్‌షాప్‌లు ఉండొద్దు

- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, ఎస్పీ హర్షవర్ధన్



జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, ఎస్పీ హర్షవర్ధన్‌లు

జడ్చర్ల/ నవాబ్‌పేట/ రాజాపూర్, జనవరి 21 : జడ్చర్ల నియోజకవర్గంలో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి బెల్ట్‌షాప్‌లు ఉండొద్దని, గంజాయి, గుట్కాలపై ఉక్కుపాదం మోపాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, ఎస్పీ హర్షవర్ధన్‌లు హెచ్చరించారు. జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో ఆదివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడుతూ జడ్చర్ల నియోజకవర్గంలో హరిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు బెల్ట్ షాపులను బంద్ చేయనున్నట్లు చెప్పారు. బెల్ట్ షాపు నిర్వాహకులంతా ఫిబ్రవరి 1వ తేదీలోగా తమ వద్ద ఉన్న స్టాక్‌ను క్లియర్ చేసుకోవాలని సూచించారు. గ్రామాలలో దొంగచాటుగా మద్యం విక్రయిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హె చ్చరించారు. గ్రామాలలో మద్యం విక్రయిస్తున్న వారి వివరాలను, సమాచారాన్ని అందించాలని గ్రామస్తులను కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, వారికి రూ.10వేల నజరానా అందిస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. గంజాయి వాడినా, విక్రయించినా వారిపై కఠినంగా వ్యవహరిస్తా మని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రాములు, డీఎస్పీ మహేష్, జడ్చర్ల సీఐ రమేశ్‌బాబు, ఎస్ఐలు చంద్రమోహన్, నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు. ● నవాబ్‌పేట మండలంలోని గురుకుంట గ్రామంలో విశ్రాంత ప్రిన్సిపాల్ వ్యాసుల రామాంజనేయులు దినకర్మలో భాగంగా ఆయన చిత్ర పటానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు జనుంపల్లి దుశ్యంత్‌రెడ్డి నివాళ్లు అర్పించారు. మండల అధ్యక్షుడు రామచంద్రయ్య, దేపల్లి వెంకటేష్‌గౌడ్, నవాజ్‌రెడ్డి, ప్రభాకర్, శ్రీహరి, రమేష్‌గౌడ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన వీవోఏలు

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళా సంఘాల బుక్ కీపర్లు జడ్చర్ల శాసన సభ్యుడిగా ఎన్నికైన జనుంపల్లి అనిరుద్‌రెడ్డిని శనివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వీవోఏలు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి అభినందించారు. తమ సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని వారు కోరారు. ఎమ్మెల్యేను సన్మానించిన వారిలో ఆంజనేయులు, శ్రీలత, అరుణ, భార్గవి, జయమ్మ, రుక్కంపల్లి భీమయ్య, శ్రీను, మొగులయ్య, మంజుల, సావిత్రి, గోపాల్, భాగ్య, సుజాత, రమాదేవి సన్మానించిన వారిలో ఉన్నారు.

చిన్మయ్య మఠం అభివృద్ధికి కృషి

- ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి



రజతోత్సవాల్లో మాట్లాడుతున్న ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి

నవాబ్‌పేట, జనవరి 21 : మండలంలోని కొల్లూర్ గ్రామంలో జీవసమాధి అయిన చింతలపూడి చిన్మయ స్వామి మఠం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం నిర్వహించిన సామూహిక హోమం కార్యక్రమంలో జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మాడెమోని నర్సింహులు, వైస్ ఎంపీపీ సంతోష్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, సర్పంచ్ సౌజన్యరఘుతో కలిసి రజతోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మఠం అభివృద్ధికి రూ.1,16,000ల నగదు నందీశ్వర స్వామికి అందజేశారు. ఆయనతోపాటు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి మంజులప్రభాకర్ రూ.1,16,000ల నగదు అందజేశారు. సామూహిక హోమంలో సుమారు 200 మంది దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గండు చెన్నయ్య, ప్రతాప్, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ చందర్ నాయక్, లక్ష్మీనర్సింహరాజు, సుధీర్‌రెడ్డి, లంబ వెంకటయ్య, ఖాజ, వాసు యాదవ్, గోపాల్ గౌడ్, బోజయ్యచారీ, చంద్రమోహన్, సత్యనారాయణ గౌడ్, చంద్ర మోహన్, సున్నాల కృష్ణయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

లెనిన్‌కు ఘన నివాళి



లెనిన్ శతవర్ధంతి సందర్భంగా ర్యాలీ చేపట్టిన టీఎఫ్‌టీయూ నాయకులు

పాలమూరు, జనవరి 21 : విప్లవమంటే ఆకలంత సహజమైనదని టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం ఖలీల్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో టీఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో వి.ఐ.లెనిన్ శతవర్ధంతి సందర్భంగా పట్టణంలో ర్యాలీ, సభ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పి.విజయ్‌కుమార్ అధ్యక్షత వహించిన సభలో వక్తలు మాట్లాడుతూ కామ్రేడ్ వి.ఐ. లెనిన్ ప్రపంచ పీడిత ప్రజల ప్రియతమ నాయకుడని కొనియాడారు. శ్రామిక ప్రజల విముక్త సిద్ధాంతమైన మార్క్సిజాన్ని మహోన్నతంగా నిలిపిన ఆదర్శప్రాయుడన్నారు. పెట్టుబడిదారి విధానపు అత్యున్నత దశయే సామ్రాజ్యవాదమన్నారు. ప్రపంచ ప్రజల ముందు తేటతెల్లం చేశారన్నారు. కార్మికవర్గం బలప్రయోగం ద్వారానే తమని తాము ముక్తి చేసుకుంటారని, తద్వారా ప్రపంచాన్ని విముక్తి చేస్తారని లెనిన్ చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. కేఎన్‌పీఎస్ జిల్లా నాయకులు నర్సప్ప, టీపీఎఫ్ నాయకులు బుచ్చారెడ్డి, వీఆర్‌ఏ సంఘం రాష్ట్ర నాయకులు ఎన్.గోవిందు, విజయభాస్కర్, జయపాల్, కృష్ణయ్యలు ప్రసంగించారు.

● సీఐటీయూ ఆధ్వర్యంలో : ఎర్రజెండా ముద్దుబిడ్డ వి.ఐ. లెనిన్ శతవర్ధంతి సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో నివాళి అర్పించారు. కిల్లెగోపాల్, సీపీఎం నాయకులు ఆర్.రాంరెడ్డి, నల్లవెల్లి కురుమూర్తి ప్రసంగించారు. వి.పద్మ, ప్రశాంత్, భరత్, ఖాదర్, మాణిక్యంరాజు, ఈశ్వర్, సురేష్, విజయవర్ధన్, రాజు పాల్గొన్నారు.

● జడ్చర్ల : వ్లాదిమర్ లెనిన్ 100వ జయంతి సందర్భంగా ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో జడ్చర్లలో ఆయన చిత్రపటానికి సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య పూలమాల వేసి నివాళులు అర్పించారు. భాగి కృష్ణయ్య, ఇర్ఫాన్, బొందయ్య, సత్యం, రాజు, శ్రీనివాస్, నజీర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను బాధ్యులను చేయడం సరికాదు

- టీఎంఆర్ఈఐఎస్ అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు , మహేష్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 21 : ప్రతి ఘటనకు ఉపాధ్యాయులను బాధ్యులను చేయడం సరికాదని, గురుకుల ఉపాధ్యాయులపై సస్పెన్షన్, టెర్మినేషన్‌ను వెంటనే ఎత్తివేయాలని తెలంగాణ అల్పసంఖ్యాక వర్గాల గురుకులాల సంస్థ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు, మహేష్ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మారు మాట్లాడారు. గురుకులాలన్నింటిని ఒకే గొడుకు కిందకు తేవాలని డిమాండ్ చేశారు. గురుకులాల్లో అన్నివసతులు కల్పించాలన్నారు. రాష్ట్ర నాయకులు జావీద్, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు రవికుమార్, రవీంద్ర ప్రసాద్‌గౌడ్, జిల్లా అధ్యక్షులు వెంకటేష్, కార్యదర్శి రవికుమార్, టీఎంఆర్‌ఈఐఎస్ జిల్లా అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శి జావేద్, ఉపాధ్యక్షులు పద్మ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 21 : గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా గోపాల్ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో జరిగిన గిరిజన ఉద్యోగుల సంఘం సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్య పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు గోపాల్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా గంగరాంతో పాటు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికలకు అధికారులగా జీహెచ్ఎం దశరథ్ నా యక్, ఎల్ఎఫ్‌హెచ్ఎం రాములు వ్యవహరించారు. సమావేశంలో గిరిజన సంఘం అధ్యక్షకార్యదర్శులు రాజునాయక్, యాదగిరినాయక్, మాజీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు దేవుజానాయక్, చంద్రనాయక్, బాలానగర్ జడ్పీటీసీ కళ్యాణి లక్ష్మన్‌నాయక్, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎంపీపీ, సర్పంచిని పరామర్శించిన మాజీ మంత్రి

హన్వాడ, జనవరి 21 : అయోధ్యనగర్ సర్పంచి భర్త లక్ష్మానాయక్ అనారోగ్యంతో మృతిచెందాడు. ఆదివారం ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అయోధ్యనగర్ తండాకు వెళ్లి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీపీ బాలరాజు, పార్టీ అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, రమణారెడ్డి, మాజీ జడ్పీటీసీ నరేందర్, కొండ లక్ష్మయ్య, వైస్ చైర్మన్ కృష్ణయ్య గౌడ్ మన్నన్, మోహన్, వెంకటయ్య శ్రీదేవి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, సర్పంచులు అంత్యక్రియలలో పాల్గొని సర్పంచి, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా మండల మాజీ ఎంపీపీ విజయలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకొని ఆమెను మాజీ మంత్రి పరామర్శించారు.

ఇసుక సరఫరాతోనే మాకు ఉపాధి

పాలమూరు, జనవరి 21 : ఇసుక సరఫరాతోనే మాకు ఉపాధి లభిస్తుందని భవన నిర్మాణ రంగం కార్మికులు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డిని కలిశారు. నెలరోజుల నుంచి జిల్లా కేంద్రానికి ఇసుక సరఫరా లేకపోవటంతో వీధిన పడ్డామని కార్మికులు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. అధికారులతో మాట్లాడి నిబంధనలమేరకు పట్టణానికి ఇసుక సరఫరా చేయించాలని విజ్ఞప్తి చేశారు. కార్మిక సంఘం నాయకులు వరద లక్ష్మయ్య, ఎర్ర వెంకటయ్య, గోదా రాములు, కందూరు నాగన్న, కార్మికులు ఎమ్మెల్యేను కలిశారు.

రేపు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆత్మయ సమ్మేళనం

దేవరకద్ర, జనవరి 21 : మండల కేంద్రంలోని మంగళవారం దేవరకద్ర నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల, కార్యకర్తల ఆత్మియసమ్మేళనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు కార్యక్రమంఉంటుంది, ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి పార్లమెంట్ పరిధిలో ఉన్న ఎమ్మెల్యేలు వస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు జీవితకాలం బస్‌పాసు

పాలమూరు, జనవరి 21 : ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల్లో భార్యాభర్తలకు జీవితకాలం బస్‌పాసు సౌకర్యం విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఏ.రాజసింహుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భార్యాభర్తలు జీవితకాలం ఉచిత బస్‌పాసు సౌకర్యం పొందేందుకు ఒక్కొక్కరు రూ.250లు చెల్లించి డిపోలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆర్టీసీ యాజమాన్యం తొందరలోనే జీవోను తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఈ వకాశాన్ని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు అందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జర్నలిస్టు తిరుపతయ్యకు పరామర్శ



జర్నలిస్టు తిరుపతయ్య భార్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు

పాలమూరు, జనవరి 21 : సీనియర్ జర్నలిస్టు తిరుపతయ్యను టీయూడబ్ల్యుజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు దండు దత్తేందర్, ప్రధాన కార్యదర్శి బి.జి రామాంజనేయులు ఆదివారం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో పరామర్శించారు. అధైర్యపడవద్దని తిరుపతయ్య కుటుంబానికి భరోసానిచ్చారు. అన్ని విధాలుగా యూనియన్ అండగా ఉంటుందన్నారు. తిరుపతయ్య తొందరగా కోలుకుని జర్నలిస్టుగా విధులు మళ్లీ నిర్వహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. తిరుపతయ్య వైద్య ఖర్చుల నిమిత్తంఆర్థిక సాయం చేశారు. జెమిని శేఖర్‌గౌడ్, కె.వెంకట్, శ్రీనివాస్, పేట వెంకటయ్య, సతీష్, ఖాజామొనోద్దీన్‌లు పరామర్శించిన వారిలో ఉన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

హన్వాడ, జనవరి 21 : చిన్నదర్పల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కమిటీని ఆదివారం చిన్నదర్పల్లిలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా సున్నలి యాదగిరి, ఉపాధ్యక్షులుగా గోవిందు, ప్రధాన కార్యదర్శిగా కావలి బాలరాజ్, సభ్యులుగా లక్ష్మమ్మ, రామలక్ష్మి, బాలకృష్ణ, తిరుపతయ్య, గణేష్, సత్యమూర్తిలను ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు యాదగిరి తెలిపారు. అందరికి పథకాలు అందేవిధంగా కృషిచేస్తానాని చెప్పారు.

నిర్మాణ కార్మికులకు ఉచిత వైద్యశిబిరం

జడ్చర్ల, జనవరి 21 : భవన నిర్మాణ రంగంతో పాటు ఇతర నిర్మాణ రంగ కార్మికులకు ఆదివారం జడ్చర్లలో కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆర్చి సమీపంలో కార్మిక శాఖ ఆధ్వర్యంలో సిఎస్‌సి హెల్త్‌కేర్ సిబ్బందితో వైద్య శిబిరం నిర్వహించారు. 145 మందికి రక్తపోటు, గుండెపనితీరు, షుగర్, కొలెస్ట్రాల్ తదితర 50రకాల పరీక్షలు నిర్వహించారు. బాలరాజు, రిహనుల్లా, రాజేశ్ పాల్గొన్నారు.